వేసవి ప్రారంభంలోనే తాగునీటి కొరత

- అడుగంటిన భూగర్భ జలాలు.. వట్టిపోయిన బోర్లు
- గతేడాదితో పోలిస్తే ట్యాంకర్లకు భారీగా పెరిగిన డిమాండ్
- సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్న అధికారులు

బంజారాహిల్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మార్చి ప్రారంభంలోనే నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఏప్రిల్ చివరి వారంలో బోర్లలో నీరు అడుగంటుతుంది. అయితే ఈ సారి మాత్రం ఇప్పటికే చాలా బోర్లు వట్టిపోయాయి. దీంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా సంజీవరెడ్డినగర్ జలమండలి డివిజన్ పరిధిలో ఉన్న 12 సబ్ డివిజన్‌ల పరిధిలో నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. దీనికి అనుగుణంగా జలమండలి అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదనంగా ఫిల్లింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ట్యాంకర్లను సమకూర్చుకుంటున్నారు.

గతేడాదితో పోల్చితే 45శాతం అధిక డిమాండ్

సంజీవరెడ్డినగర్ జలమండలి డివిజన్ పరిధిలో కాలనీతో పాటు మురికివాడలు అనేకం ఉన్నాయి. చాలా వరకు అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల్లో నివసించే వారు నీటి కోసం బోర్ల పై ఆధారపడతారు. సహజంగా ఏప్రిల్ చివరి వారం, మే నెలలో బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుంది. ఈ ఏడాది మాత్రం ఇప్పటికే డివిజన్ పరిధిలో ఉన్న 50 శాతం బోర్లు అడుగంటాయి. దీంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. గతేడాది మార్చితో పోలిస్తే ఈ సారి 45 శాతం అధికంగా ట్యాంకర్లకు డిమాండ్ పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఏప్రిల్ చివరి వారంలో డిమాండ్ మరింతే పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకుంటున్నప్పటికీ ఆ స్థాయిలో నీటి సరఫరా జరిగితేనే ఎలాంటి సమస్యలు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు.

చైనా మీటర్లతో సమస్యలు

డివిజన్ పరిధిలోని బస్తీల్లో ఎక్కువ శాతం మంది జలమండలి సరఫరా చేసే నీటి మీదే ఆధారపడి ఉంటారు. ఇందుకు అనుగుణంగా అధికారులు నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ చైనా మీటర్లతో నీటిని లాగేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బోరబండ, ఎర్రగడ్డ, ఎల్లారెడ్డిగూడ, బీఎస్ మక్తా, ఎంఎస్‌మక్తా, ఫిలింనగర్ వంటి ప్రాంతాల్లో చైనా మోటార్లను విరివిగా వినియోగిస్తున్నారు. నీరు అధికంగా వచ్చేందుకు ఈ మీటర్లను వాడుతుండటం వల్ల వీధి చివరిలో ఉన్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాంకేతిక కారణాలతో నీటి సరఫరా ఆపేస్తారనే అనుమానంతో ప్రజలు అదనంగా నీటిని లాగేసి స్టోర్ చేసుకుంటున్నారు.

అదనంగా ఫిల్లింగ్ స్టేషన్లు

వేసవి డిమాండ్‌ను అధిగమించేందుకు డివిజన్ పరిధిలో ఆరు అదనపు ఫిల్లింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం ఉన్నతాధికారుల ఆమోద ముద్ర లభించింది. ప్రస్తుతం ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లకు అదనంగా ట్యాంకర్లను సమకూర్చుకొని డిమాండ్‌కు తగ్గట్టుగా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎల్లారెడ్డిగూడ ఫిల్లింగ్ స్టేషన్‌లో రెండు ఫిల్లింగ్ పాయింట్లు ఉండగా అదనంగా మరో రెండు చేర్చనున్నారు. సంజీవరెడ్డినగర్, ఫతేనగర్, వెంకటగిరిలో ఒక్కోటి చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే సర్వీసింగ్ సెంటర్‌లు, ఇతర వ్యాపార కేంద్రాల నిర్వాహకులకు తాగునీటిని వినియోగించొద్దని హెచ్చరికలు జారీ చేశారు.



ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న జలమండలి సిబ్బంది

భయపడాల్సిన అవసరం లేదు



ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిన క్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ల మీద భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. అదనపు సిబ్బందిని, ట్యాంకర్లను సమకూర్చుకున్నాం. ట్యాంకర్ బుక్ చేసుకున్న 24 గంటల్లో పంపిస్తున్నాం. కొంతమంది ట్యాంకర్ బుక్ చేసుకుని చివరి నిమిషంలో క్యాన్సిల్ చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. బుక్ చేసి క్యాన్సిల్ చేసినా అది లెక్కలోకి వస్తుంది. దీని వల్ల ఓ ట్యాంకర్ నీటి అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుంది. తాగునీటి సమస్యలపై భయపడాల్సిన అవసరం లేదు.

- హరిశంకర్, ఎస్ఆర్‌నగర్ జలమండలి ఎండీ


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

బోరబండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కూడలిలో వైన్‌షాప్ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ట్రాఫిక్ అధికారులను కోరారు. వైన్స్‌కు వచ్చేవారు తమ వాహనాలను పరిసర ప్రాంతాల్లో నిలపడం వల్ల ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు కార్పొరేటర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. వైన్ షాప్‌ను అక్కడి నుంచి తరలించాలని కోరుతూ ట్రాఫిక్ ఏసీపీకి కార్పొరేటర్ రాసిన లేఖను స్థానికులు ఏసీపీ కార్యాలయంలో అందజేశారు.


రోడ్డు ఆక్రమించి నిర్మించిన షెడ్డును పరిశీలిస్తున్న సుస్మిత

రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే ఊరుకోం

- డిప్యూటీ సిటీ ప్లానర్ సుస్మిత

బేగంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని బేగంపేట సర్కిల్ డిప్యూటీ సిటీ ప్లానర్ ఆర్.సుస్మిత హెచ్చరించారు. బుధవారం మోతీలాల్ నెహ్రూనగర్‌లో పర్యటించి ఆక్రమణలను పరిశీలించారు. కాలనీలో పలువురు రోడ్లను ఆక్రమించి షెడ్లు నిర్మించడంతో పాటు విద్యుత్ జనరేటర్లు, ట్రాన్స్‌ఫార్మలు ఏర్పాటు చేశారని, వీటి వల్ల కాలనీలోకి వెళ్లే రోడ్డు చిన్నగా మారిందని ఇటీవల ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె సూచనల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని సుస్మిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం తదితరులు పాల్గొన్నారు.


ఐడియాజెన్ ప్రతినిధులు అందజేసిన దుస్తులు ధరించిన విద్యార్థులు

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

బోరబండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బోరబండ బలహీనవర్గాల కాలనీలోని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐడియాజెన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కల్పించిన సదుపాయాలు, విద్యార్థులు ఆసక్తి కనబరిచే అంశాల గురించి ఉపాధ్యాయులను అడిగి కంపెనీ ప్రతినిధులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూకే ప్రతినిధి క్లైయిర్ నీ, ఐడియాజెన్ హైదరాబాద్ ప్రతినిధులు శ్రీధర్, ఆది, ప్రదీప్, సుకన్య, పునీత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసిన ఐడియాజెన్ ప్రతినిధులకు ప్రధానోపాధ్యాయులు గీత కల్వూరి కృతజ్ఞతలు తెలిపారు.

కిచెన్‌లో చెలరేగిన మంటలు.. వ్యక్తికి గాయాలు

బంజారాహిల్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వంట చేస్తుండగా మంటలు చెలరేగడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన హెచ్.కృష్ణ కుటుంబంతో కలిసి షేక్‌పేటలోని అపర్ణ వన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న విధులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. ఆహారం వేడి చేసేందుకు గ్యాస్ వెలిగించగా మంటలు ఎగిసిపడి కృష్ణకు మంటలు అంటుకున్నాయి. అతడి అరుపులకు భార్య నిద్రలేచి స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించింది. కృష్ణ ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు నమోదు

బంజారామిల్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషిస్తూ యువతిని ఇబ్బంది పెట్టిన ఇద్దరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఏపీకి చెందిన ప్రత్యూష అలియాస్ షాజియా డిజైనర్‌గా పనిచేస్తుంది. ఆమె షేక్‌పేటలో ఓ అద్దె ఇంట్లో షేక్ అంజూమ్ అలియాస్ సనతో కలిసి రెండు సంవత్సరాలుగా ఉంటుంది. అంజూమ్ గదికి మగవారిని తీసుకువస్తుండటంతో ప్రత్యూష అడ్డు చెప్పేది. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగేది. అంజూమ్ స్నేహితురాలు రోజలైన్ వచ్చి గదిలో చేరింది. ఇద్దరు కలిసి ప్రత్యూషను కులం పేరుతో దూషించి ఇబ్బంది పెట్టేవారు. ఇదిలా ఉండగా ప్రత్యూష ఫోన్ తీసుకొని అంజూమ్ ఓ వ్యక్తికి మెసేజ్ పంపించింది. అందులో అంజూమ్ పేరు పెట్టడంతో సదరు వ్యక్తి ప్రతి రోజూ ప్రత్యూషను వేధించడం మొదలు పెట్టాడు. మానసికంగా కుంగిపోయిన ప్రత్యూష ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించింది. అంజూమ్, రోజలైన్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఖైరతాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, డీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఖైరతాబాద్ జాగీర్దార్‌బాడలోని ఓ ఇంట్లో బంగారం, వెండి చోరీకి గురైన కేసును దర్యాప్తు చేసిన ఖైరతాబాద్ డీఐ సైదులు పాత నేరస్తుల వివరాలను ఆరా తీశారు. మాసాబ్ ట్యాంక్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న షేక్ ఖలేందర్‌పై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన ఖలేందర్ (31)పై గతంలో బేగంబజార్, కర్ణాటక యాద్గిర్ టౌన్ పోలీస్‌స్టేషన్, ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులున్నాయి.గతంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసిన నిందితుడు తన వద్ద ఉన్న టూల్ కిట్ సహాయంతో ఇళ్ల తాళాలు తీసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు 11 తులాల బంగారు నగలు, 6 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

'విద్య'కు 15శాతం నిధులు కేటాయించాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

పంజాగుట్ట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కల్యాణి, రాకేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ఏడాది కేవలం 7 శాతం నిధులే కేటాయించారని, వాటిని సైతం పూర్తిగా విడుదల చేయలేదన్నారు. విశ్వవిద్యాలయాలకు బ్లాక్ గ్రాంట్ పెంచకుండా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. గత 15 నెలల కాలంలో గురుకులాల్లో 83 మంది పేద పిల్లల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యతన్నారు. సంవత్సర కాలంలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు.. అధికారం చేపట్టి ఏడాది దాటినా 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు శ్రీరామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు


ఖర్గేకు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

ఎస్సీ రిజర్వేషన్లను 18శాతానికి పెంచాలి

ఎర్రగడ్డ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని కోరుతూ బుధవారం మాలమహానాడు నాయకులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలతో కలిసి వారు ఖర్గేను కలిశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు ప్రధాన కార్యదర్శి దుబ్బాక నవీన్ మహర్, నాయకులు ఎస్ఎస్‌కే ఆకాష్, చేతన్ కుమార్, ప్రవీణ్, శ్రావణ్, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహనకు రథయాత్ర

- ఎస్సీ, ఎస్టీ సమాఖ్య జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ నర్సింగ్‌రావు

పంజాగుట్ట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర జరుగుతోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ సమాఖ్య జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం.నర్సింగ్‌రావు ఆరోపించారు. చాలా మందికి రాజ్యాంగంపై అవగాహన లేకపోవడంతో అదేంటని అడుగుతున్నారని, అందుకే ప్రజలకు అవగాహన కల్పించేందుకు దక్షిణ భారతదేశ రథయాత్రను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి జి.శంకర్, జాతీయ సెక్రటరీ జనరల్ పి.జాన్ పాల్, రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజలింగం, ప్రధాన కార్యదర్శి ఎస్.మునికుమార్‌లతో కలిసి దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగంపై అవగాహన కల్పించడానికి ఏప్రిల్ 14 నుంచి దక్షిణ భారత రథయాత్రను చేపడుతున్నామన్నారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని.. ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న దీక్షా భూమి వరకు కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర సమన్వయకర్తలు మహమ్మద్ సనాఉల్లా ఖాన్, బి.పద్మ, ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగ్‌రావు, శంకర్, జాన్‌పాల్ తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న గూడూరి చెన్నారెడ్డి

లీగల్ సర్వీస్ అథారిటీలను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగడ్డ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన చిన్నచిన్న వివాదాలను పరిష్కరించుకోవడానికి లీగల్ సర్వీస్ అథారిటీలు ఉపయోగపడతాయని తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి పంచాక్షరి అన్నారు. బుధవారం మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ బ్రాంచ్‌ను, ఓసీ, బీసీ, మైనార్టీ కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సర్వీస్ ద్వారా న్యాయస్థానమే ఇక్కడి ప్రజల వద్దకు వచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని ప్రజలకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోతీనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు గూడూరి చెన్నారెడ్డి మాట్లాడుతూ.. మోతీనగర్‌లో లీగల్ సెల్‌ను ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోర్టు సెక్రటరీ శ్రీదేవి, నాంపల్లి కోర్టు సెక్రటరీ జావేద్, మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు పీఏఎస్ మూర్తి, బి.సీతారామయ్య, శ్రీకృష్ణారెడ్డి సాగర్, బైరెడ్డి, హైవి రాజు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


జలమండలి మేనేజర్ సూర్యప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవిశేఖర్ రెడ్డి, కాలనీ వాసులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పంజాగుట్ట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సంస్థ జాతీయ కార్యదర్శి పీవీ రవిశేఖర్ రెడ్డి జలమండలి మేనేజర్ సూర్యప్రకాష్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం వినతి పత్రం అందజేశారు. రోజు విడిచి రోజు తాగునీరు వస్తున్నాయని, గత నెల రోజులుగా గంటన్నర మాత్రమే సరఫరా జరుగుతుందన్నారు. వాటర్ ట్యాంకర్లను బుక్ చేసిన వెంటనే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కాలనీ వాసులు రంగారావు, సీనియర్ సిటిజెన్ ఫోరం ఉపాధ్యక్షుడు సారంగ రావు, న్యాయవాది లక్ష్మీ కాంతారావు, అశోక్‌కుమార్, గౌస్‌ఖాన్, నాగరాజు, సాంబయ్య ఉన్నారు.

జూబ్లీహిల్స్ సర్కిల్ వైద్యాధికారి బదిలీ


భార్గవ్ నారాయణ

ఖైరతాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ భార్గవ్ నారాయణ మాతృ సంస్థ అయిన వైద్యారోగ్య శాఖకు బదిలీ అయ్యారు. చాలాకాలం పాటు ఖైరతాబాద్ సర్కిల్‌తో పాటు జూబ్లీహిల్స్ సర్కిళ్లలో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. వైద్యారోగ్య శాఖ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన భార్గవ్ నారాయణను అక్కడికే బదిలీ చేశారని, దీంతో ఆయన జూబ్లీహిల్స్ సర్కిల్ నుంచి రిలీవ్ అయ్యారని సర్కిల్ అధికారులు తెలిపారు. జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్‌చార్జి వైద్యాధికారిగా చందానగర్ సర్కిల్‌కు చెందిన వైద్యాధికారి డా. కేఏస్ రవికి బాధ్యతలు అప్పగించారు.

ఉచిత పరికరాలకు పేర్లు నమోదు

పంజాగుట్ట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ,ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఉచితంగా పరికరాలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు బుధవారం ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు, వయోవృద్ధులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. త్వరలోనే వారికి పరికరాలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

పాదచారిని అడ్డగించి దారి దోపిడీ

బంజారాహిల్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి దాడికి పాల్పడడంతో పాటు దోపిడీకి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్నూల్‌కు చెందిన షేక్ రఫీ(24) బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని జహీరానగర్‌లో నివాసం ఉంటూ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విధులు ముగించుకున్న షేక్ రఫీ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని అన్నపూర్ణ స్టూడియో వైపునుంచి టీడీపీ భవన్ వైపు వెళ్తుండగా వెనకనుంచి స్కూటీపై వచ్చిన ముగ్గురు యువకులు అతడిని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. ఈ గొడవను ఆపేందుకు ప్రయత్నిస్తున్నట్లు నటించిన ఓ ట్రాన్స్‌జెండర్ రఫీ జేబులోంచి రూ.1500 తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ట్రాన్స్‌జెండర్ వెళ్లిపోయిన తర్వాత ముగ్గురు యువకులు రఫీ చేతిలో ఉన్న మొబైల్‌తో పాటు రూ.12 వేల నగదు లాక్కున్నారు. ట్రాన్స్‌జెండర్‌తో కలిసి వీరంతా ముఠాగా దోపిడీకి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుండిగల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మహారాష్ట్ర షైరాహో టోలక్ జిల్లా నిఘడి గ్రామానికి చెందిన జైశ్వాల్(22) బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేటకు వచ్చి బీసీ కాలనీలో అతడి పెద్దన్న కుమారుడి గదిలో ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి 12:30 గంటలకు యాక్టివాపై మల్లంపేట నుంచి కేవీఆర్ వ్యాలీకి వెళ్తున్నాడు. పోచమ్మ ఆలయం సమీపంలోకి రాగానే ఓ లారీ అదుపు తప్పి వెనుక నుంచి జైశ్వాల్‌ను ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. జైశ్వాల్ మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డివైడర్‌ను ఢీకొని మరొకరు..

గాజులరామారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీకొని మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన కె.ఈశ్వర్(39) బుధవారం తెల్లవారుజామున వాటర్ ట్యాంకర్‌తో వెళ్తున్నాడు. మార్గమధ్యలో రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఈశ్వర్ కిందపడగా అతనిపై వాటర్ ట్యాంకర్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భవనం పైనుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

పేట్ బషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెండవ అంతస్తు పైన పని చేస్తున్న తాపీ మేస్త్రీ ప్రమాదవశాత్తు కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేట్ బషీరాబాద్ ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భవన్ రజాక్(40) బతుకుదెరువు కోసం వలస వచ్చి కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న అమృత ప్రాజెక్ట్‌లో మేస్త్రీగా పనిచేస్తూ అందులోనే నివాసముంటున్నాడు. ఈ నెల 11న రెండవ అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు, ముక్కుకు బలమైన గాయాలై రక్తస్రావమైంది. తోటి కార్మికులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అమృత ప్రాజెక్ట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని మృతుడి భార్య పేట్ బషీరాబాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



తలసాని శ్రీనివాస్‌తో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

రెజిమెంటల్‌బజార్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా డివిజన్ బండిమెట్‌లోని శ్రీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ పూజలు బుధవారం జరిగాయి. పూజలకు హాజరైన తలసాని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో దైవ ప్రార్థనకు సమయం కేటాయించాలని, తద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హరికృష్ణ, నాగులు, మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, నందగోపాల్, శంకర్, జనార్దన్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలకు తలసాని హాజరు

పద్మారావునగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని, పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేశన్‌రాజు, లక్ష్మీపతి, ఆలయ నిర్వాహకులు సాయిరామ్‌చారి, హరిచారి, ఏసూరి మహేశ్, ప్రేమ్‌కుమార్, ముక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ముఖ్యనేతలు

ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలి

- బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

అడ్డగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. తుకారాంగేట్ వెంకటేశ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బుధవారం అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. మోదీ సారథ్యంలో అడ్డగుట్టకు రావడంతో అడ్డగుట్టలో బీజేపీ నాయకుల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, నాయకుడు నర్సింగ్‌రావు, కృష్ణ, రాజారాం, వీరేశం పాల్గొన్నారు.

'ఆరోగ్య సంరక్షణ అందరికీ చేరువ చేయడమే లక్ష్యం'

రాంగోపాల్‌పేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణను అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని అపోలో డయాలసిస్ క్లినిక్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) సుధాకర్ రావు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం బన్సీలాల్‌పేటలోని హోం ఫర్ ది ఏజ్డ్ అండ్ డిజేబుల్డ్‌లో ప్రత్యేక సేవా కార్యక్రమం ఏర్పాటు చేశారు. 700 మందికి పైగా వికలాంగులు, వృద్ధులు, పేదలకు ఉచితంగా మూత్రపిండ ఆరోగ్య పరీక్షలతో పాటు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపోలో డయాలసిస్ క్లినిక్ వైద్య నిపుణులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని మూత్ర పిండాల ఆరోగ్యం, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (సీకేడీ) ప్రమాదాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి మార్పుల గురించి అవగాహన కల్పించారు.



బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ, ఏఈ అమూల

కొత్త విద్యుత్ దీపాలను వెంటనే ఏర్పాటు చేయండి

- బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్, మార్చి12(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని కాలనీల్లో పని చేయని విద్యుత్ దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. డివిజన్‌లోని పార్సిగుట్ట, న్యూఅశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో విద్యుత్‌శాఖ ఏఈ అనూషతో కలిసి ఆయా కాలనీల్లో కార్పొరేటర్ పర్యటించారు. వీధి దీపాలతో పాటు కాలనీలోని ఇతర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొన్నిరోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. వెంటనే కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో శ్రీమాన్య రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఏఐటీఏ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఎ.శ్రీమాన్య రెడ్డి సింగిల్స్‌లో సెమీస్‌కు, డబుల్స్‌లో ఫైనల్‌లోకి ప్రవేశించింది. ముంబైలో జరుగుతున్న ఈ పోటీల్లో బుధవారం ముగిసిన సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీమాన్య 6-3, 6-4తో సుహాని గోరే (న్యూఢిల్లీ)పై గెలిచి, సెమీస్ చేరింది. డబుల్స్ సెమీస్‌లో శ్రీమాన్య-దియా ఫెర్నాండెజ్ (ముంబై) జోడీ 6-2, 6-2తో మనోగ్యశ్రీ-నర్మదామనిపై గెలిచి, ఫైనల్లో ప్రవేశించింది.



చికిత్స పొందుతూ మేస్త్రీ మృతి

పేట్ బషీరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రెండవ అంతస్తు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డ మేస్త్రీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్సై సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భవన్ లఖర్(40) బతుకుదెరువు కోసం వలస వచ్చి కొంపల్లి పురపాలిక సంఘం పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న అమృత ప్రాజెక్ట్‌లో మేస్త్రీగా పనిచేస్తూ అందులోనే నివాసముంటున్నాడు. ఈ నెల 11న రెండవ అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడడంతో తలకు, ముక్కుకు బలమైన గాయాలై రక్తస్రావమైంది. తోటి కార్మికులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య పేట్ బషీరాబాద్ పోలీసులకు అమృత ప్రాజెక్ట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం..

పాఠకులకు శాపం!

- సక్రమంగా విధులకు రాని ఇన్‌చార్జి లైబ్రేరియన్
- సమయపాలన పాటించని సహాయ సిబ్బంది
- గ్రంథాలయానికి నిత్యం తాళం
- ఇబ్బంది పడుతున్న పాఠకులు, విద్యార్థులు
- మెట్టుగూడ గ్రంథాలయం దుస్థితి ఇదీ


చిలకలగూడ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం మెట్టుగూడలోని గ్రంథాలయం నిర్వహణ అధ్వాన్నంగా తయారు కావడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. లైబ్రరీని సక్రమంగా తెరవకపోవడం లేదని, రోజుల తరబడి తాళం వేసి ఉంటోందని స్థానికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మెట్టుగూడ వార్డు కార్యాలయ ఆవరణలోని ఓ భవనంలో గ్రంథాలయం కొనసాగుతోంది. పండితుల నవలు, జీవిత చరిత్ర పుస్తకాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు ఇక్కడ ఉన్నాయి. వారపత్రికలతో పాటు రోజూ వివిధ దిన పత్రికలను తెప్పిస్తారు. పాఠకుల కోసం కుర్చీలు, బల్లలు వంటి సౌకర్యాలను కల్పించడంతో పాటు ఇటీవల బాత్‌రూమ్‌ను కూడా నిర్మించారు. సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ.. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో గ్రంథాలయం నిరుపయోగం మారిందని పాఠకులు ఆరోపిస్తున్నారు.

లైబ్రేరియన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతోనే..

లైబ్రేరియన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో వేరే గ్రంథాలయానికి చెందిన లైబ్రేరియన్‌ను మెట్టుగూడకు ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన వివిధ కారణాల వల్ల సక్రమంగా విధులకు రావడం లేదని, దీనిని ఆసరా చేసుకొని సహాయ సిబ్బంది కూడా విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సహాయ సిబ్బంది కూడా సమయ పాలన పాటించడం లేదని, ఎక్కువగా లైబ్రరీకి తాళం వేసి ఉంచుతున్నారని మండిపడుతున్నారు.

- దిన పత్రికలతో పాటు విద్యార్థులకు ఉపయోగ పడే పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచడం లేదని చెప్తున్నారు. గ్రంథాలయం అని తెలిపే బోర్డును కూడా పక్కన పెట్టేశారంటే గ్రంథాలయ సిబ్బంది తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు పలువురు పేర్కొంటున్నారు.
- ఇప్పటికైనా గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులు మెట్టుగూడ గ్రంథాలయం పాఠకులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.



మెట్టుగూడలోని గ్రంథాలయ భవనం



పక్కన పడేసిన గ్రంథాలయం బోర్డు

ఒత్తిడిని జయించి ఉత్తీర్ణత సాధించాలి

- విద్యార్థులకు సైకాలజిస్టు జ్యోతిరాజా సూచన

పద్మారావునగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నాపత్రంలోని అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలమనే విశ్వాసంతో పరీక్షలకు హాజరైతే తప్పకుండా మంచి మార్కులతో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్టు పి.జ్యోతిరాజా అన్నారు. బుధవారం బన్సీలాల్‌పేట డివిజన్ పరిధి చాచానెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లో రెయిన్ బో ఫౌండేషన్ ఇండియా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్, ఆశ్రిత, బ్లూ ఫౌండేషన్, భవిత ఫౌండేషన్, విల్ హెల్పింగ్ విలేజ్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 120 మంది పదో తరగతి విద్యార్థులకు 'భయం వీడితే జయం మనదే' అంటూ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపేలా ఉచిత అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు పి.జ్యోతిరాజా .. పరీక్షలంటే భయమెందుకు, మానసిక ఒత్తిడిని ఎలా జయించాలి, చదివింది ఎలా గుర్తుపెట్టుకోవాలి అనే మెళకువలను విద్యార్థులకు వివరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలు ముగిసే వరకు సోషల్‌మీడియా, టీవీ, సినిమాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ ప్రత్యేక శిబిరంలో బన్సీలాల్‌పేట, బోయిగూడ, ఆదయ్యనగర్ స్మారక ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న సైకాలజిస్టు జ్యోతిరాజా

సైకాలజిస్టు జ్యోతిరాజాను, బన్సీలాల్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కెసన్నమాల, ఆదయ్య స్మారక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డిలను సత్కరించారు. శిబిరంలో మాజీ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి రాజా నరసింహారావు, దూద్‌బావి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లికార్జునమ్మ, రెయిన్ బో ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీలత, సిటీ డెస్క్ మేనేజర్ క్రాంతికిరణ్, జర్నలిస్టులు చంద్రశేఖర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- జీహెచ్ఎంసీ అధికారులకు శ్రీనాథ్ కాంప్లెక్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

రాంగోపాల్‌పేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ కాంప్లెక్స్ ప్రదేశాన్ని ఆక్రమించి పార్కింగ్ సమస్య సృష్టిస్తున్నారని శ్రీనాథ్ కమర్షియల్ కాంప్లెక్స్ అసోసియేషన్ ఆరోపించింది. కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి నర్ర దీపక్, కోశాధికారి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... 1981 నుంచి తమ కాంప్లెక్స్ కొనసాగుతుండగా జీహెచ్ఎంసీ శాంక్షన్ ప్లాన్‌లో కాంప్లెక్స్ ముందుండే ప్రాంతాన్ని పార్కింగ్ ప్రదేశంగా చూపించి వాడుకుంటున్నామన్నారు. అయితే ఇటీవల తమ కాంప్లెక్స్ ఎదురుగా రాయల్ క్యాసిల్ కాంప్లెక్స్‌ను ఓ బిల్డర్ నిర్మించారని, వారికి పడమటి వైపు రోడ్డు ఉండగా తమ కాంప్లెక్స్ వైపు రోడ్డును ఆక్రమంగా వాడటంతో పాటు తమకు పార్కింగ్ ప్రదేశం లేకుండా చేస్తూ సమస్యలు సృష్టిస్తున్నారని తెలిపారు. దీనిపై జీహెచ్ఎంసీలో ఫిర్యాదు చేయగా నేరు రోజుల క్రితం టౌన్‌ప్లానింగ్ అధికారి పరిశీలించి తమ కాంప్లెక్స్ వైపు గోడ కట్టాలని సదరు బిల్డర్‌కు సూచించారని, అయినా అక్రమంగా నిర్మాణం చేయడంతో పాటు 119 మంది ప్లాట్ ఓనర్లకు సమస్యలు సృష్టిస్తున్నారని అన్నారు.ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాదచారిని అడ్డగించి దోపిడీ

బంజారాహిల్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి దాడికి పాల్పడడంతో పాటు దోపిడీకి పాల్పడిన ముఠాను బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలుకు చెందిన షేక్ రఫీ(24) బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని జహీరానగర్‌లో నివాసం ఉంటూ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విధులు ముగించుకున్న షేక్ రఫీ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని అన్నపూర్ణ స్టూడియో వైపునుంచి టీడీపీ భవన్ వైపు వెళ్తుండగా వెనకనుంచి స్కూటీపై వచ్చిన ముగ్గురు యువకులు అతడిని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. ఈ గొడవను ఆపేందుకు ప్రయత్నిస్తున్నట్లు నటించిన ఓ ట్రాన్స్‌జెండర్ రఫీ జేబులోంచి రూ.1500 తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ట్రాన్స్‌జెండర్ వెళ్లిపోయిన తర్వాత ముగ్గురు యువకులు రఫీ చేతిలో ఉన్న మొబైల్‌తో పాటు రూ.12 వేల నగదు లాక్కున్నారు. ట్రాన్స్‌జెండర్‌తో కలిసి వీరంతా ముఠాగా దోపిడీకి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రజకులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

చిలకలగూడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ, దూద్‌బావిలో దశాబ్దాలుగా నివసిస్తున్న రజకులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. చాలా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, రజకుల్లో అర్హులకు వాటిని కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్, సికింద్రాబాద్ క్రాంతి రజక సంఘం అధ్యక్షుడు ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి రమేష్ గార్ల తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భరత్ గౌడ్, శారద మల్లేష్ తదితరులు



శంకర్‌రావును శాలువాతో సత్కరిస్తున్న జేవీఎల్ ప్రసాద్, రామకృష్ణ తదితరులు

'మజ్దూర్' నేత శంకర్‌రావుకు సత్కారం

చిలకలగూడ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ ఆకౌంట్స్ ఉద్యోగులు హోదా పేరు మార్పు కోసం కృషి చేసిన మజ్దూర్ యూనియన్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావును బుధవారం అకౌంట్స్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఆయనను సత్కరించారు. ఎన్నో ఏళ్ల తమ సమస్య మజ్దూర్ యూనియన్ పరిష్కరించడం, హోదా సంతృప్తికరంగా ఉండటంతో అకౌంట్స్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీఎల్ ప్రసాద్, చింతకుంట రామకృష్ణ, సుబ్బరామయ్య, కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ఆక్రమించి నిర్మించిన షెడ్డును పరిశీలిస్తున్న సుస్మిత

రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే ఊరుకోం

- డిప్యూటీ సిటీ ప్లానర్ సుస్మిత

బేగంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని బేగంపేట సర్కిల్ డిప్యూటీ సిటీ ప్లానర్ ఆర్.సుస్మిత హెచ్చరించారు. బుధవారం మోతీలాల్ నెహ్రూనగర్‌లో పర్యటించి ఆక్రమణలను పరిశీలించారు. కాలనీలో పలువురు రోడ్లను ఆక్రమించి షెడ్లు నిర్మించడంతో పాటు విద్యుత్ జనరేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారని, వీటి వల్ల కాలనీలోని పలు రోడ్లు చిన్నగా మారిందని ఇటీవల ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ నాయకులకు కాలనీవాసులు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె నూతనల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని సుస్మిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం తదితరులు పాల్గొన్నారు.

'విద్య'కు 15శాతం నిధులు కేటాయించాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

పంజాగుట్ట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కల్యాణ్, రాకేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ఏడాది కేవలం 7 శాతం నిధులే కేటాయించారని, వాటిని సైతం పూర్తిగా విడుదల చేయలేదన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు శ్రీరామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రైస్తవుల ఉపవాస దీక్షలు

తిరుమలగిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల గుడ్ ఫ్రైడే వరకు 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగుతాయని రెవరెండ్ పాస్టర్ ప్రొఫెసర్ రాజేశ్వర్ సాల్మన్ తెలిపారు. కొన్ని యుగాలుగా ఆధ్యాత్మిక సాంప్రదాయంలో భాగంగా ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. బుధవారం ఆయన తిరుమలగిరి లాల్‌బజార్‌లోని గ్యారిసన్ వెస్లీ చర్చిలో మాట్లాడుతూ, ఆత్మ, శరీరం ప్రక్షాళన పరివర్తన చెందడానికి ఇలాంటి దీక్షలు ఉపయోగపడతాయన్నారు. భక్తి శ్రద్ధలతో దీక్షతో దేవుడిని సేవించాలని సూచించారు. రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రార్థనలు పూజలు జరుగుతాయని చెప్పారు. చర్చి పరిధిలోని సుమారు 500మంది సంఘ సభ్యులు ఇక్కడ ఆదివారం మినహాయించి రోజూ గుడ్ ఫ్రైడే వరకు ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు.



రెవరెండ్ డాక్టర్ రాజేశ్వర్ సాల్మన్

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషిస్తూ, తనను ఇబ్బంది పెట్టిన ఇద్దరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఏపీకి చెందిన ప్రత్యూష అలియాస్ సాయిలా డిజైనర్‌గా పనిచేస్తోంది. ఆమె షేక్‌పేటలో ఓ బట్టల షాప్ నిర్వహిస్తోంది. ప్రత్యూష రాజ్‌భవన్‌కు చెందిన అంజుమ్ స్నేహితులు కలిసి గ్రౌండ్‌లో ఉండేవారు. షేక్‌పేటలో ఉన్న ఓ భవనంలో నివాసం ఉంటున్నారు. ... ప్రత్యూష అడ్డు చెప్పింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అంజుమ్ స్నేహితులు రజిలైన్ వచ్చి గొడవలో చేరింది. ఇద్దరు కలిసి ప్రత్యూషను కులం పేరుతో దూషించి ఇబ్బంది పెట్టారు. ఇదిలా ఉండగా ప్రత్యూష ఫోన్ తీసుకుని అంజుమ్ ఓ వ్యక్తికి మెసేజ్ పంపించింది. అందులో అంజుమ్ పేరు పెట్టడంతో సదరు వ్యక్తి ప్రతి రోజూ ప్రత్యూషను వేధించడం మొదలు పెట్టాడు. మానసికంగా కుంగిపోయిన ప్రత్యూష ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించింది. అంజుమ్, రజిలైన్‌పై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఖైరతాబాద్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, డీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల ఖైరతాబాద్ జాగీర్దార్‌వాడలోని ఓ ఇంట్లో బంగారం, వెండి చోరీకి గురైన కేసును దర్యాప్తు చేసిన ఖైరతాబాద్ డీఐ సైదులు పాత నేరస్తుల వివరాలను ఆరా తీశారు. మాసాబ్ ట్యాంక్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న షేక్ ఖలీందర్‌పై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన ఖలీందర్ (31)పై గతంలో బేగంబజార్, కర్ణాటక యాద్గిర్ టౌన్ పోలీస్‌స్టేషన్, ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులున్నాయి.గతంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసిన నిందితుడు తన వద్ద ఉన్న టూల్ కిట్ సహాయంతో ఇళ్ల తాళాలు తీసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు 11 తులాల బంగారు నగలు, 6 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితుడు

బౌద్ధనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం దొంగతనానికి యత్నించిన వ్యక్తిని చిలకలగూడ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన కుత్బుద్దీన్‌కు కుటుంబసభ్యులు ఎవరులేరు. మద్యానికి అలవాటు పడిన తరచూ ఇళ్లలో చోరీలకు అలవాటు పడ్డాడు. ఇదే క్రమంలో పద్మారావునగర్ సాయిబాబా ఆలయం పక్కన ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీకి యత్నించగా, అప్రమత్తమైన స్థానికులు కుత్బుద్దీన్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి: సీఐటీయూ

అడ్డగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రక్షక్ సెక్యూరిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా రైల్వేలో పనిచేస్తున్న 50 మంది కాంట్రాక్టు కార్మికులకు వెంటనే వేతన బకాయిలు, బోనస్ చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ రైల్వే జీఎంను కోరారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని డీఆర్ఎం కార్యాలయం ముందు సీఐటీయూ నాయకులు నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సంస్థ కింద నాలుగు నెలల జీతాలతో పాటు రెండేళ్ల బోనస్‌ను వెంటనే చెల్లించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. అనంతరం రైల్వే అధికారి శ్రీహరికు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతకుమార్ గౌడ్, సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్ బాబు, కార్మికులు కవిత, సాజిదా బేగం, హైమాలతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు